

మళ్లీ టూ ట్వంటీ ఆక్రమణకు యత్నం!

కురబలకోట మండలంలోని అంగళ్లు మిట్స్ కళాశాల సమీపంలోని సర్వే నంబరు టూట్వంటీ (220) భూ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. -10లో



అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అసాంఘిక శక్తులపట్ల పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు పేర్కొన్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నూతన నియామకం



డాక్టర్ ఖాజావలి

మదనపల్లె సిటీ: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ హిస్టరీ చైర్మన్‌గా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపకుడు డాక్టర్ ఖాజావలిని వైస్ చాన్స్‌లర్ నియమించారు. 24 సంవత్సరాలుగా హిస్టరీ అధ్యాపకునిగా, ప్రస్తుతం ప్రొఫెసర్ హోదాలో పని చేస్తున్నారు. ఖాజావలిని కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు అభినందించారు.

హజ్ కమిటీ రాష్ట్ర సభ్యునిగా..



పఠాన్ ఖాదర్‌ఖాన్

మదనపల్లె సిటీ: హజ్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యునిగా మదనపల్లె పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు పఠాన్ ఖాదర్‌ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు పఠాన్ ఖాదర్‌ఖాన్‌ను ముస్లిం థియాలజీ నుంచి ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రూటా రాష్ట్ర నాయకులు పఠాన్ మహమ్మద్‌ఖాన్ ఆయనకు అభినందనలు తెలిపారు.

చేనేత గుర్తింపుకార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లాలోని చేనేత కార్మికులకు అవసరమైన గుర్తింపు కార్డు కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్.పవన్‌కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. https://tricorniotec.com/ webapp/ hand loom/ home ద్వారా దరఖాస్తు చేసిన అనంతరం మొబైల్ నంబర్‌కు మెసేజ్ వస్తుందన్నారు. దరఖాస్తును ప్రింట్ తీసి ఉంచుకోవాలన్నారు. చేనేత సేవా కేంద్రం, విజయవాడ వారు దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా స్వీకరించి, వారి వారి గృహాలను వ్యక్తిగతంగా సందర్శించి గుర్తింపుకార్డులను మంజూరు చేస్తారని ఆయన తెలియజేశారు.

నేడు సిద్దవటం కోటలో వారసత్వ దినోత్సవం

సిద్దవటం: సిద్దవటంలోని మట్లిరాజుల కోటలో శుక్రవారం ప్రపంచ వారసత్వ దినత్సోవం నిర్వహించనున్నట్లు జిల్లా పురాతత్వ సర్వేక్షణాధికారి డాకారెడ్డి తెలిపారు.సిద్దవటం కోటను గురువారం ఆయన సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు చిత్రలేఖనం, , వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. చారిత్రక కట్టడాలకు సంబంధించిన ఫోటోఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. ఇంటాక్, ఏఎస్ఐ ప్రతినిధులతో విద్యార్థులకు ప్రపంచ వారసత్వ దినోత్సవంపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ సత్యనారాయణ, ఎంటీఎస్ సిబ్బంది స్వరూప్‌రామ్, నందకిషోర్, నాగేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

25 శాతం కోటాను అమలు చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ఆర్‌టీఈ-2009 ప్రకారం 2025-2026 విద్యా సంవత్సరానికి 1వ తరగతి ప్రవేశాలకు జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ పాఠశాలల్లో 25 శాతం కోటాను అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుబ్రమణ్యం గురువారం తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యాల వారు తమ పాఠశాలల వివరాలను ఆన్‌లైన్‌లో ఈ నెల 26వ తేదీలోపు రిజిస్టర్ చేయాలన్నారు. సంబంధిత ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఈ ప్రక్రియ నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ పేర్కొన్నారు.

లలితమ్మకు అమెరికా ఆహ్వానం



లలితమ్మ

మదనపల్లె సిటీ: బాలల హక్కుల కోసం చేస్తున్న సేవలను గుర్తించి అమెరికాకు చెందిన క్రై సంస్థ మదనపల్లె పట్టణానికి చెందిన ఫోర్డు డైరెక్టర్ జిల్లా లలితమ్మకు పలు కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. ఈ మేరకు క్రై సంస్థ నుంచి సమాచారం వచ్చింది. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 22 నుంచి మే 6వతేదీ వరకు అమెరికాలోని న్యూజెర్సీ, ఆస్టిన్, హౌస్టన్, శాండీగో, సీటిల్లై, బయరీ తదితర రాష్ట్రాల్లో బాలల హక్కుల కోసం జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఫోర్డు సంస్థకు రెండో సారి ఆహ్వానం అందినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో జాతీయనటి షబానా అజ్మి కూడా పాల్గొంటారన్నారు. ఈ పర్యటన ద్వారా క్రై అమెరికా సంస్థ మద్దతుగా సేవలు అందిస్తున్న వారికి మరింత ప్రోత్సాహం లభించగలదనే విశ్వాసం వ్యక్తం చేశారు.



వేతన యాతన

మండు వేసవిలోనూ నిత్యం కష్టపడుతున్న ఉపాధి కూలీలకు కష్టకాలం దాపురించింది. రోజంతా స్వేదం చిందిస్తూ రెక్కల కష్టం చేస్తున్నా వారికి ఆకలి బాధలు తప్పడం లేదు. కూలీ డబ్బులను కేంద్రం ఇప్పటివరకు విడుదల చేయకపోవడంతో వారు పడుతున్న వేదన వర్ణణాతీతం. సుమారు మూడు నెలలుగా శ్రమిస్తున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు.

- మూడు నెలలుగా ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- జిల్లాలో 2.51 లక్షల జాబ్ కార్డులు
- సుమారు 3.29 లక్షల మంది కూలీలు
- జిల్లా వ్యాప్తంగా రూ. 37.23 కోట్ల బకాయిలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



సాక్షి రాయచోటి: జిల్లాలో సుమారు 2,07,000 జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో సభ్యులు 3,29,000 మంది ఉన్నారు. అయితే జనవరి 15 నుంచి ప్రస్తుత ఏప్రిల్ నెలలో ఇప్పటివరకు వారికి దినసరి కూలీ వేతనం అందలేదు. గతంలో వారానికి, పది రోజులకు ఒకసారి అందే పరిస్థితి నుంచి నెలల తరబడి కూలీ మొత్తాలు అందకపోవడంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు నెలల వ్యవధిలో సుమారు 14 లక్షల పనిదినాలు కల్పించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నా వారు పడుతున్న కష్టానికి ఫలితం రాలేదు.

పండుగలకు పస్తులే...

ఈ ఏడాది ఆరంభంలో జనవరి 15వ తేదీ వరకు కొంతమేర కూలీలకు డబ్బులు అందినా..తర్వాతి నుంచి పెండింగ్ పడుతూ వచ్చాయి. అయితే జనవరిలో రిపబ్లిక్ డే మొదలుకొని మహాశివరాత్రి, రంజాన్, ఉగాది, శ్రీరామ నవమి, గుడ్‌ఫ్రైడే లాంటి పర్వదినాలు వచ్చినప్పటికీ వారికి పస్తులు తప్పడం లేదు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కూలీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇంతవరకు విడుదల చేయలేదు. దీంతో వారు ప్రస్తుతానికి కష్టకాలంలో కాలాన్ని వెళ్లదీస్తున్నారు.



జిల్లాకు రూ. 37 కోట్ల బకాయిలు

జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు సంబంధించి సుమారు రూ. 37 కోట్లకు పైగా బకాయి ఉంది. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే సుమారు 60-65 వేల మంది కూలీలకు ఉపశమనం లభించనుంది. ప్రతి కూలీ కుటుంబానికి మూడు నెలల మొత్తం ఒకేసారి అందిస్తే ఆర్థికంగా కొంత వెసలుబాటు లభిస్తుందని బాధితులు భావిస్తున్నారు.

అధికారులు స్పందించాలి



మల్లూరు గ్రామంలో అధికారులు నిర్దేశించిన పనులను తాము చేస్తున్నాం. అయితే సకాలంలో తమకు డబ్బులు ఎందుకు చెల్లించడం లేదో అర్థం కావడం లేదు. కుటుంబాన్ని ఎలా నెట్టుకు రావాలో అధికారులు గుర్తించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలీ డబ్బులు అందించే ఏర్పాట్లు చేయాలి. – డి.లక్ష్మిదేవి, ఉపాధి కూలీ, మల్లూరు గ్రామం, చిన్నమండెం మండలం

కష్టానికి ఫలితం లేదు



తాము మండుటెండలో కష్టపడి పనిచేస్తున్నా ఫలితం ఉండటం లేదు.ఇప్పటివరకు కూలీ డబ్బులు పడలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి కూడా తీసుకెళ్లాం. సకాలంలో డబ్బులు పడితే ఆర్థికంగా కొంత ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు ఈ విషయంగా తగిన చర్యలు తీసుకోవాలి. – ఎల్.రాజశేఖర్‌రెడ్డి, ఉపాధి కూలీ, వల్లూరు, చిన్నమండెం మండలం

ప్రభుత్వానికి నివేదించాం



జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు సంబంధించి రూ. 37 కోట్ల మేర విడుదల కావాల్సి ఉంది. దీనికి సంబంధించి ప్రభుత్వానికి సొమ్ముల విషయంపై నివేదికలు పంపాం. కూలీ సొమ్ములు రాగానే ఆయా కూలీల అకౌంటుకు జమ కానుంది. – డాక్టర్ టి.వెంకటరత్నం, డ్వామా పీడీ, రాయచోటి, అన్నమయ్య జిల్లా

యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

కడప సెవెన్‌రోడ్స్: ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు పొందిన, అలాగే ఎస్ఎస్‌సీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించే యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నామని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి.నారాయణయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షకు మించరాదని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి ఉండాలన్నారు. విద్యార్థులు తమ బయోడేటా, మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్, ఫోటోలను జతపరిచి పంపాలన్నారు. ఇతర వివరాలకు 94408 49234 , 94406 51405 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ఉండాలి



డ్రోన్‌ను ఎలా ఉపయోగించాలో వివరిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్: ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం తప్పక ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో డ్రోన్లు ఎలా ఉపయోగించాలో టెక్నీషియన్లకు అవగాహన కల్పించారు. అనంతరం చంద్రానాయక్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా ఒక ఎకరం పొలంలో పది నిమిషాలలో పురుగు మంది పిచికారీ చేయొచ్చన్నారు. కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. జిల్లాకు 34 డ్రోన్లు 80 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎండీ ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ పి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూకు రూ.10 కోట్ల ప్రాజెక్టు మంజూరు

వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు



ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాన్ని వైవీయూ అధ్యాపకులతో కలిసి చూపుతున్న వీసీ అల్లం శ్రీనివాసులరావు

కడప ఎడ్యుకేషన్: అకడమిక్, రీసెర్చ్ ఎక్సలెన్స్ దిశగా దూసుకెళ్తున్న యోగి వేమన విశ్వవిద్యాలయానికి మెగా రీసెర్చ్ ప్రాజెక్ట్ మంజూరైంది. 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ 'పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ (ఏ ఎన్ ఆర్ ఎఫ్-పి.ఎ.ఐ.ఆర్) పథకం కింద యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌తో కలిసి రూ. 10 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్టు కోసం యోగి వేమన విశ్వవిద్యాలయం లో రోగనిర్ధారణ, మెటబాలిక్, ఇన్ఫెక్షన్స్, అంటువ్యాధుల చికిత్సలు, వ్యాధి నిఘా యంత్రాంగంపై దృష్టి సారించే మొత్తం 22 ప్రతిపాదనలను వివిధ విభాగాలలో కలసి 27 మంది అధ్యాపకులు సమర్పించారు. ప్రాజెక్టు నిధులతో పరిశోధనలు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని స్పోక్ సంస్థగా ఎంపిక చేయడం, ఆ తర్వాత ప్రతిష్టాత్మకమైన ఎఎన్‌ఆర్‌ఎఫ్-పీఎఐఆర్ గ్రాంట్‌ను అందించడం వెనక విశ్వవిద్యాలయంలో నాణ్యమైన బోధన, పరిశోధన ఉన్నత ప్రమాణాలే కారణమన్నారు. పరిశోధన నిధులతో నాణ్యమైన పరిశోధనలు చేస్తామన్నారు. పరిశోధనల కేంద్రంగా, పరిశోధన వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా. పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి, ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యంశర్మ పాల్గొన్నారు.

పథకాల ప్రగతి సాధనలో లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్


రాయచోటి: ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్‌నుంచి ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి వీసీలో జిల్లా కలెక్టర్, డీఆర్‌ఓ మధుసూదనరావు పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 19న మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఉచిత ఇసుక పథకంలో జిల్లా అవసరాలకు తగినంత ఇసుక నిల్వలను సిద్ధం చేసుకోవాలన్నారు. వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చేపట్టిన ఎంఎస్ఎంఈల సర్వేను పటిష్టంగా నిర్వహించాలన్నారు.

పదివేల ఎకరాల్లో పచ్చిమేత పెంపకానికి కృషి

జిల్లాలో పదివేల ఎకరాల్లో పచ్చిమేత పెంపకానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి సబ్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లు, డీఎల్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రెవెన్యూ అంశాలు, నిత్యావసర వస్తువుల పంపిణీ, పల్లె పండుగ పనులు, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పనులు, తాగునీరు తదితర అంశాలపై సమీక్ష చేసి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. నిరుపయోగంగా, వ్యవసాయ వినియోగం లేని భూములను నేపియర్ గడ్డి పెంపకానికి గుర్తించిన ఏజెన్సీకి లీజుకు ఇస్తే ఎకరాకు వార్షికంగా రూ. 30 వేలు ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో మూడు నుంచి నాలుగు వేల ఎకరాలు లీజుకు ఇస్తే రైతులకు నికర ఆదాయం ఉంటుందన్నారు. పల్లె పండుగ క్రింద జిల్లాలో చేపట్టిన పనులన్నింటినీ ఈ మాసాంతంలోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, వైఖోమ్ నదియా దేవి, డిఆర్‌ఓ మధుసూదనరావు, ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధర లేక.. దిక్కుతోచక!

- పంట విక్రయించేందుకు అన్నదాత అగచాట్లు
- తగ్గుతున్న ధాన్యం ధరలు
- ఆందోళనలో రైతులు





యంత్ర పరికరాలతో వరి పంటను కోస్తున్న దృశ్యం



వరి ధాన్యాన్ని వ్యాపారవేత్తలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్న దృశ్యం

సుండుపల్లె: రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధరలు మాత్రం లేవు. ఎకరం వరి పంట సాగు చేయాలంటే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. నాట్లు మొదలుకొని పంట నూర్పిడి వరకు చీడ పీడలను నివారిస్తూ తీరా పంట చేతికి వచ్చాక మార్కెట్లో ధర ఉండటం లేదని.తక్కువ ధరకు అమ్ముకొని నష్టాల పాలవుతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో చాలా మంది రైతులు వ్యవసాయం చేయడం మానేస్తున్నారు.

- జిల్లాలో 6,885 హెక్టార్లకు 2024-25 సంవత్సరం రబీ సీజన్లో 2,735 హెక్టార్లలో మాత్రమే రైతులు వరి పంటను సాగు చేశారు. సిద్దవటం మండలంలో 621 హెక్టార్లు, నందలూరు మండలంలో 300, రాజంపేట మండలంలో 260, కలికిరి మండలంలో 231, వాయల్పాడు మండలంలో 203, పీలేరు మండలంలో 147, సుండుపల్లె మండలంలో 133 హెక్టార్లలో వరి పంటను సాగు చేయగా మిగతా మండలాల్లో వరి సాగు తగ్గింది. వ్యవసాయ కూలీలు, రసాయనిక ఎరువులు, తెగుళ్లకు మందులు, సేద్యపు ఖర్చులు రోజు రోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కౌలు రైతులకు అదనంగా ఖర్చు వస్తుంది. కూలీలు సమయానికి దొరక్కపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పంట పెట్టినప్పటి నుంచి పంట చేతికి వచ్చి విక్రయించే వరకు భయం భయంగా కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది.

గత ప్రభుత్వంలో 77 కేజీల వరి ధాన్యం బస్తా రూ.2 వేలు

గత ప్రభుత్వంలో జిల్లాలో 77 కేజీల వరి ధాన్యం బస్తా రూ.2 వేల నుంచి గరిష్ఠంగా రూ.2,200 వరకు అమ్మినట్లు రైతులు తెలిపారు. కానీ ఈసారి రబీ సీజన్లో వరి ధాన్యం బస్తా రూ.1,400 రేటు పలికింది. దీంతో ఒక్కో బస్తాపై దాదాపు రూ.600 నష్టపోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు దుక్కులు దున్నేందుకు ఎరువులు, వరి నాటు, కలుపు కూలీలు, వరికోత ఖర్చులు కలిపి దాదాపు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చు వస్తుందని చెబుతున్నారు. ఒక ఎకరాకు పంట బాగా పండితే 38 బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.


వరి రైతుకు రూ.15.58 కోట్ల నష్టం

జిల్లాలో ఎకరాకు 38 బస్తాలు దిగుబడి వస్తుంది. కానీ ఒక బస్తాకు రూ.600 రేటు తగ్గింది. జిల్లాలో 6,837 ఎకరాల్లో వరి సాగు చేయగా ఒక ఎకరాకు 38 బస్తాల సగటున 2,59,806 బస్తాల దిగుబడి అంచనా. ఒక బస్తాకు రూ.600 చొప్పున రూ.2,59,806 బస్తాలకు నష్టం రూ.15,58,83,600 ఈసారి రబీ రైతులు వరి ధాన్యంపై నష్టపోయారు.

నియోజకవర్గాల వారీగా వరిసాగు హెక్టార్లలో..


రాజంపేట:	1,428
రైల్వేకోడూరు:	239
పీలేరు:	706
రాయచోటి:	116
మదనపల్లె:	219
తంబళ్లపల్లె:	28

ప్రభుత్వం ఆదుకోవాలి



రబీ సీజన్లో రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరా పంట సాగుకు రూ.40 ఖర్చు అయింది. దిగుబడి ఎకరాకు ఐదున్నర పుట్టి వచ్చింది. అయితే పుట్టి వడ్లు రూ.11 వేలకు అడుగుతున్నారు. గత ప్రభుత్వంలో పుట్టి వడ్లు రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నాం . ప్రభుత్వం ఆదుకోవాలి. – నాగమునిరెడ్డి, రైతు, వంతాటిపల్లి, సిద్దవటం మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



రెండు ఎకరాలలో వరి పంటను సాగు చేశాను. సాగు ఖర్చులు పెరగడంతో అప్పు చేసి పెట్టుబడి పెట్టినా పంట చేతికందే సమయంలో ధరలు ఉండటం లేదు. దీంతో తమ కష్టానికి ఫలితం దక్కడం లేదు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. – పోకల సిద్దయ్య, రైతు, సుండుపల్లె మండలం


విద్యార్థినికి గోల్డ్‌మెడల్ ప్రదానం



విద్యార్థినికి పతకం, సర్టిఫికెట్ అందజేస్తున్న సుభాషిణి

పీలేరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదివి గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలో తెలుగు సబ్జెక్టులో 99 శాతం మార్కులు సాధించిన విద్యార్థిని పి నందినికి ఇదే కళాశాల పూర్వ విద్యార్థి, పద్మావతి మహిళా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ యర్రదొడ్డి సుభాషిణి గురువారం గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ సుభాషిణి మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలలో మెరిట్ విద్యార్థినులకు ప్రతి ఏటా పతకాలు,సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం ఫౌజియాబేగం, ఉపాధ్యాయినులు సుజాత, గంగయ్య, శ్రీకళ, ఉమామహేశ్వరి, రెడ్డి దీపారాణి, ఇంద్రాణి, ప్రసన్నలక్ష్మీ, రాధారాణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



హసనాపురంలో పనులు పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం: మండలంలోని హసనాపురం పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పీడీ వెంకటరత్నం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజువారి వేతనం రూ.350 వచ్చేలా ఉపాధి కూలీలు పని చేయాలన్నారు. మండలంలో మంజూరైన ఫారంపాండ్స్, పశువుల నీటి తొట్టి పనులు ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా కూలీలు 3 నెలలుగా చేసిన పనులకు డబ్బులు రాలేదని పీడీ దృష్టికి తీసుకురాగా మూడురోజుల్లో వస్తాయని తెలియజేశారు. లక్ష్మినరసయ్య, ఏపీఓ పెంచలయ్య, టీఏ చంద్రశేఖర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు రవిశంకర్‌రెడ్డి, పక్కీర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


టి.శంకరయ్య (ఫైల్)

ఓబులవారిపల్లె : గాదెల వెంకటాపురం గ్రామానికి చెందిన టి.శంకరయ్య 15 రోజులుగా కనిపించడం లేదని, గురువారం కుటుంబ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిసినట్లయితే 9121100580 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

విద్యుత్ స్తంభం విరిగిపడి పాడి ఆవు మృతి

రామసముద్రం : జోరుగా వీచిన ఈదురు గాలులకు చెట్టుకొమ్మ విరిగి విద్యుత్ లైన్‌పై పడటంతో ఆ దెబ్బకు విద్యుత్ స్తంభం విరిగి పాడి ఆవుపై పడింది. ఈ ప్రమాదంలో పాడి ఆవు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి అరికెల పంచాయతీ దాసిరెడ్డిపల్లిలో జరిగింది. ఆవు యజమాని దామోదర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిలుపుదల కోసం విద్యుత్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడి ఆవు విలువ సుమారు. రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

రామసముద్రం : వరకట్నం కోసం వేధింపులకు గురిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాలేనత్తం పంచాయతీ ఎరపశెట్టిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప కుమార్తె లావణ్య (23) ను పెద్దపంజాణికి చెందిన సునీల్ ప్రతాప్‌కు ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. అయితే భర్త సునీల్ ప్రతాప్, అత్త గంగులమ్మలు వరకట్నం తెమ్మని వేధిస్తున్నారని లావణ్య ఫిర్యాదు చేసిందన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల గ్రామ మసీదులో మౌజన్‌గా పని చేస్తున్న అజ్మత్‌పై అదే గ్రామానికి చెందిన వల్లీసాబ్ అనే వ్యక్తి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలో ఉన్న ఓ చింత చెట్టు ఫలసాయాన్ని మసీదు అవసరాలకు వినియోగించాలనేది మత పెద్దల నిర్ణయం. ఈ నేపథ్యంలో మౌజన్ చింత కాయలను కోస్తుండగా ఇదే గ్రామానికి చెందిన వల్లీసాబ్ అనే వ్యక్తి ఈ చింత చెట్టు తమ పూర్వీకులదని, ఇందులో తమకూ హక్కు ఉందని, కాయలు కోయడానికి నువ్వెవరు అని దూషిస్తూ అజ్మత్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మళ్లీ టూ ట్వంటీ ఆక్రమణకు యత్నం!

- అడ్డుకున్న హక్కుదారులు
- ఇరు వర్గాలను స్టేషన్‌కు తరలించిన ఎస్‌ఐ
- నడలిన ఉద్రిక్తత


అంగళ్లు టూట్వంటీ భూ వివాదంపై మాట్లాడుతున్న ముదివేడు ఎస్‌ఐ

కురబలకోట : మండలంలోని అంగళ్లు మిట్స్ కళాశాల సమీపంలోని సర్వే నంబరు టూట్వంటీ (220) భూ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. గురువారం పుంగనూరుకు చెందిన కొందరు ఈ భూమిలో ప్రవేశించి రేకులు వేసేందుకు ప్రయత్నించారు. దీంతో మొదటి నుంచి ఈ భూమిపై హక్కులతో పాటు స్వాధీన అనుభవంలో వి. వెంకటరమణ రాజు (రాజు), సుబహాన్ తదితరులతో పాటు ఇక్కడ ప్లాట్లు కొన్నవారు వీరిని నిలువునా అడ్డుకున్నారు. భూ హక్కు పత్రాలు చూపాలని పట్టుబట్టారు. పుంగనూరుకు చెందిన వారు వినకుండా రేకులు వేస్తామని లారీలో వాటిని తెప్పించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాల వారు పరస్పరం మోహరించారు. ఈ విషయం ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌కు సమాచారం అందడంతో హుటాహుటిన ఆయన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఉన్నతాధికారులతో పరిస్థితిపై సమీక్షించారు. ఇరువర్గాల వారితో చర్చించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తుతుండడంతో ఇరు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేట్‌మెంట్లు రికార్డు చేసి వదిలి పెట్టారు. భూ వివాదాన్ని చర్చల ద్వారా లేదా చట్ట పరిధిలో పరిష్కరించుకోవాలని ఎస్‌ఐ సూచించారు. దాదాగిరిలా వ్యవహరిస్తే తగిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్‌ఐ హెచ్చరించారు. ఇదిలా ఉండగా టూట్వంటీ సర్వే నంబరులో ఐదున్నర ఎకరం ఉంది. ఇది హైవేకు అనుకుని ఉంది. రూ. 10 కోట్లకుపైగా విలువ చేసేదిగా ఉంది. గతంలో కూడా వివిధ ప్రాంతాల వారు ఈ భూమిపై కన్నేసి రాద్ధాంతం చేశారు. ఒకరైతే చుట్టూ ఫెన్సింగ్ కూడా వేసి ఆక్రమించారు. ఇక్కడ ప్లాట్లు కొన్న వారు స్థానికులు మూకుమ్మడిగా తరలి వచ్చి ఈ ఫెన్సింగ్‌ను ఒక్కసారిగా ధ్వంసం చేయడంతో పాటు నిమిషాల్లో నేల మట్టం చేశారు. మదనపల్లెకు చెందిన వి. రాజు తదితరులు ఈ భూమిని 2016లో అంగళ్లుకు చెందిన ఇస్మాయిల్, ఖలీల్, సీకే మహమ్మద్ తదితరుల నుండి కొన్నారు. ప్లాట్లు వేసి 72 మందికి విక్రయించారు. కొందరు కట్టడాలు కూడా నిర్మించారు. రికార్డు కూడా వీరికి పక్కాగా ఉంది. అయినా ఎవరెవరో వచ్చి ఆక్రమించే యత్నం చేస్తున్నారు. గురువారం వచ్చిన వారికి కూడా ఈ భూమికి సంబంధించి కనీసం వన్‌బీ లేదా పట్టాదారు పాసుపుస్తకం కూడా లేదు. మాదే భూమంటూ చొరబడే యత్నం చేశారు. 1923లో సదరు భూమిని వీరు విక్రయించినట్లు రికార్డులు కూడా ఉన్నాయి. అయినా భూమి తమదేనంటూ ఆక్రమించే యత్నం చేయడం విడ్డూరంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. అంగళ్లలోని టూ ట్వంటీ భూ వివాదం ఎనిమిదేళ్లుగా నడుస్తూనే ఉంది. అన్నమయ్య జిల్లాలోనే టూట్వంటీ భూ వివాదం హైటెన్షన్‌గా మారింది. జిల్లాలోనే అత్యంత వివాదాస్పద భూమిగా పేరు పొందింది

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి


సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్

మదనపల్లె : వేటగాళ్ల ఉచ్చులో పడిన చిరుతపులిని కాపాడటంలో నిర్లక్ష్యం కనబరిచి, పులితో పాటు రెండు మగ కూనల మృతికి కారకులైన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన(బీవైఎస్) అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి చిరుత పులిని కాపాడటంలో అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ చిరుత పులి మరణానికి కారణం ముమ్మాటికీ అటవీశాఖ అధికారులదేనన్నారు. ఎఫ్‌బీఓ పర్యవేక్షణ సక్రమంగా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలానిబాషా, ఆది, వినయ్, బాలకృష్ణ, ద్వారక, వంశీ, శంకర్, జగదీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుతపులి మృతిపై విచారణకు డిప్యూటీ సీఎం ఆదేశాలు

మదనపల్లె : మదనపల్లె మండలం పాన్నూటిపాళ్యం అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుతపులి మృతి చెందిన ఘటనపై డిప్యూటీ సీఎం, అటవీ పర్యావరణశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ విచారణకు ఆదేశించారు. పీసీసీఎఫ్ చలపతిరావును విచారణాధికారిగా నియమించారు. పాన్నూటిపాలెం అటవీప్రాంతంలో ఆడ చిరుత ఉచ్చులో పడి కొన్ని గంటలసేపు నరకయాతన అనుభవించి పెనుగులాడి చనిపోవడం, ఆ చిరుత కడుపులో రెండు మగకూనలు ఉండటం, అవి చనిపోయిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయి నుంచి అందిన ప్రాథమిక సమాచారం, శాఖాపరంగా వచ్చిన సమాచారాన్ని పరిశీలించిన పవన్‌కల్యాణ్, ఘటన చోటుచేసుకున్న అనంతరం సంబంధిత అధికారులు ఏవిధంగా స్పందించారనే విషయాన్ని తెలపాల్సిందిగా విచారణాధికారిని ఆదేశించారు. పాన్నూటిపాళ్యం ఘటనపై విచారణను పర్యవేక్షించాలని అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావుకు దిశా నిర్దేశం చేశారు.

గురుకుల పాఠశాల విద్యార్థులకు పతకాలు


బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ వరప్రసాద్, ఆర్ట్ టీచర్ ఆనందరాజు

రామాపురం : విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన ఆల్ ఇండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ విభాగంలో రామాపురం గురుకుల పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. 30 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఈనెల 5వ తేదీన ఫలితాలు ప్రకటించగా అందులో ఆరుగురు విద్యార్థులకు బంగారు పతకాలు, 8 మంది విద్యార్థుకు వెండి పతకాలు దక్కడంతో ఆర్ట్ టీచర్ ఆనందరాజును ప్రిన్సిపాల్ వి.వి. వరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో... పీఎంఎన్ఆర్ఎఫ్ మంజూరు

తలసేమియా బాధితుడికి మంజూరుపత్రాన్ని అందించిన నిసార్ అహ్మద్


బాధితులకు పీఎంఎన్ఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని అందిస్తున్న నిసార్ అహ్మద్

మదనపల్లె : వైఎస్సార్ సీపీ లోక్‌సభాపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో, పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన తలసేమియా వ్యాధిగ్రస్తుడు చరణ్‌కు ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి(పీఎంఎన్ఆర్ఎఫ్) మంజూరైంది. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ చేతుల మీదుగా తలసేమియా బాధితుడు చరణ్, తాత, నానమ్మలకు రిలీఫ్‌ఫండ్ మంజూరుపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నిసార్ అహ్మద్ మాట్లాడుతూ...పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో నివాసం ఉండే గీతాంజలి, హరిబాబు దంపతుల కుమారుడు చరణ్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడన్నారు. వైద్య చికిత్సకు రూ. 14లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారన్నారు. బాధిత కుటుంబ దయనీయ స్థితిని స్థానిక నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాయం చేయాల్సిందిగా కోరారన్నారు. దీంతో స్పందించిన ఆయన ప్రధానమంత్రి నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద రూ.3లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ మొత్తాన్ని చరణ్ చికిత్స పొందుతున్న బెంగళూరు భగవాన్ మహావీర్‌జైన్ హాస్పిటల్‌కు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి జమచేశారన్నారు. ఈ సందర్భంగా చరణ్ కుటుంబ సభ్యులు.. ఎంపీ మిథున్‌రెడ్డి, సమన్వయకర్త నిసార్ అహ్మద్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె మహేష్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జుననాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ


ప్రమాదంలో కాలి బూడిదైన ద్విచక్ర వాహనం


తీవ్రంగా గాయపడిన హరీష్ కుమార్ రెడ్డి

- ఓ ద్విచక్ర వాహనం రోడ్డుపైనే దగ్ధం
- వ్యక్తికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లె : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఓ ద్విచక్ర వాహనం రోడ్డుపైనే దగ్ధమైన సంఘటన నిమ్మనపల్లిలో గురువారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు.. మదనపల్లె పట్టణం కొత్త ఇండ్లు ప్రాంతానికి చెందిన వంశీ (28) తన తల్లి, కూతురితో కలసి బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనంపై మదనపల్లి నుంచి నిమ్మనపల్లె మండలం తవళం గ్రామానికి బయలుదేరాడు. రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ గజ్జలవారిపల్లెకు చెందిన హరీష్ కుమార్ రెడ్డి(38), తన స్నేహితుడు మహబూబ్ బాషాతో కలిసి వ్యక్తిగత పనులపై నిమ్మనపల్లెకు వచ్చి, తిరిగి స్వగ్రామానికి వెళుతున్నాడు.

మార్గమధ్యంలో చల్లావారిపల్లె సమీపంలోని మలుపు మిట్ట వద్ద ద్విచక్ర వాహనాలు రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో హరీష్ కుమార్ రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, మహబూబ్ బాషా, మరో వాహనంలోని వంశీ, అతని కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంలో హరీష్ కుమార్ రెడ్డి నడుపుతున్న బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి రోడ్డుపైనే వాహనం దగ్ధమైంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనం లో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ తిప్పేస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

– నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ



రాయచోటి : జిల్లాలో పెట్రేగుతున్న అసాంఘిక శక్తులపట్ల పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో ఎస్పీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి, పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. నేర నిరూపణలకు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నేర పరిశోధన చేయాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో చైన్ స్నాచింగ్‌లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాలలోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు సంబంధిత పోలీసులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన అంతమే మాలల పంతం

– మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం


చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె : ఎస్సీ వర్గీకరణ విషయంలో కేవలం ఒక కులానికి మద్దతు తెలిపి, మిగిలిన వారిపై నిర్లక్ష్యం కనబరిచిన చంద్రబాబు పాలన అంతమే మాలల పంతమని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం తెలిపారు. గురువారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఏకపక్ష ధోరణితో వ్యవహరించడం బాధాకరమన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి విరుద్ధంగా ఎన్డీఏ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. 2011 గణాంకాల ప్రకారం 2025లో వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. మాలలకు అన్యాయం చేసిన చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని రానున్న స్థానిక సంస్థల్లో మట్టి కరిపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు యమలా చంద్రయ్య, గుండా మనోహర్, వీరనాల మాణిక్యం, ఎలక్ట్రీషియన్ మోహన్, పలమనేరు జయశంకర్, గంగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో అప్పుల బాధ భరించలేక మడక రామకృష్ణ(49) అనే కౌలు రైతు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు కౌలు వ్యవసాయంలో ఆదాయం లేకపోవడంతో అప్పులపాలయ్యాడు. ఈ నేపథ్యంలో ఓ పొలంలో వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

బీటీ కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు

మదనపల్లె సిటీ : ఘన చరిత్ర కలిగిన బీటీ కళాశాలను ప్రభుత్వం యూనివర్సిటీగా ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. గురువారం మదనపల్లెలో విలేకర్లతో మాట్లాడారు. కాలేజీలో పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలన్నారు. పీజీ కోర్సులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలన్నారు. మెడికల్ కాలేజీని పీపీపీ పద్ధతిలో కొనసాగిస్తామని ప్రభుత్వం చెప్పడంతో వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, జిల్లా అధ్యక్షుడు నరసింహ, కార్యదర్శి రమణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఇల్లు సహా నాలుగు ఇళ్లలో చోరీ

- ఎస్‌ఐ ఇంట్లో చొరబడిన దొంగలు
- రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ
- 60 తులాల బంగారు, రూ. 12 లక్షలు నగదు, 3 కిలోల వెండి అపహరణ
- శుభ కార్యానికి కర్నూలుకు వెళ్లిన ఓ కుటుంబం
- ఐదుగురు కలిసి చోరీ చేసినట్లు సీసీ కెమెరాల్లో నిర్ధారణ



బాధితులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన భార్య వసంత, చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగిన దృశ్యాలు

ప్రొద్దుటూరు క్రైం : కొన్ని రోజుల క్రితం వచ్చిన అల్లు అర్జున్ పుష్ప–2 సినిమా అందరికీ గుర్తే ఉంటుంది. ఇందులో ఎర్రచందనం స్మగ్లర్ పాత్రలో నటించిన అల్లు అర్జున్ పోలీసులకు దొరకకుండా వారికి చుక్కలు చూపిస్తాడు. కథలో భాగంగా పుష్ప చెప్పే 'దమ్మూంటే పట్టుకో షెకావత్తు.. పట్టుకుంటె వదిలేస్త సిండికేట్టు' అనే డైలాగ్ బాగా పాపులర్ అయింది. ప్రొద్దుటూరులో కూడా కొన్ని రోజుల నుంచి వరుస దొంగతనాలు చేస్తూ దొంగలు పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇళ్లల్లోకి చొరబడి వరుసగా చోరీలు చేస్తున్నా పోలీసులు వారిని పట్టులేకపోతున్నారు. ఇన్ని రోజులు ప్రజల ఇళ్లలో చోరీలు చేసిన దొంగలు ఈ సారి ఎస్‌ఐ ఇంటినే టార్గెట్ చేశారు. ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్‌ఐ ధనుంజయ ఇంట్లో చోరీ చేసి 'దమ్మూంటి పట్టుకో ధనుంజయ..! పట్టుకుంటే వదిలేస్త దొంగతనాలు' అంటూ ఎస్‌ఐకే సవాల్ విసురుతున్నారు. ఎస్‌ఐ అనే భయమే లేకుండా ఆయన ఇంట్లో హుండీని ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ ఇంట్లో చోరీ జరగడం జిల్లాలో హాట్ టాపిక్ అయింది. ప్రొద్దుటూరులో దొంగలు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు ఇళ్లల్లో చొరబడ్డారు. ఒక ఇంట్లో మాత్రం పెద్ద ఎత్తున బంగారు, వెండి, నగదును దొంగలు దోచుకెళ్లారు..ఎస్‌ఐ ఇంట్లో హుండీని ఎత్తుకెళ్లారు. మిగిలిన రెండు ఇళ్లల్లో విలువైన వస్తువులేమీ దొంగలకు దొరకలేదు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరులోని బొల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న నరాల బాలిరెడ్డి కాలనీలో విలాసవంతమైన ఇళ్లను నిర్మించారు. ఈ కాలనీలోని నాలుగు ఇళ్లలో గురువారం అర్ధరాత్రి 1.30 సమయంలో దొంగలు పడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎనమల చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో సుమారు 60 తులాల బంగారు, 3 కిలోల వెండి, రూ. 12 లక్షల నగదును దోచుకెళ్లారు. వారి ఇంటి సమీపంలో ఉన్న టూ టౌన్ ఎస్‌ఐ ధనుంజయ ఇంట్లో హుండీని దోచుకెళ్లారు. ఎస్‌ఐ ఇంటి పక్కనే ఉన్న ఈశ్వర్‌రెడ్డి, ఎల్లంశెట్టి రాజా ఇంట్లో విలువైన బంగారు నగలు ఏమీ దొరకలేదు.

కనిపెట్టి కన్నేశారు..

చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు చెన్నకేశవరెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని వివాహం ఈ నెల 13,14 తేదీల్లో ప్రొద్దుటూరులోని వైవీఆర్ కల్యాణమండపంలో జరిగింది. ఇందులో భాగంగా ఇంటికి తాళం వేసి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులందరూ 16న కర్నూలుకు వెళ్లారు. ఇదే అదనుగా దొంగలు చోరీకి పాల్పడ్డారు.

ఎస్‌ఐ ఇంటిని వదలని దొంగలు

ఎస్‌ఐ ధనుంజయుడు ఇంట్లో దొంగతనం జరగడం పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. పోలీసుల ఇళ్లకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల ఇళ్ల పరిస్థితి ఏంటని అంటున్నారు. ఎస్‌ఐ ధనుంజయుడు తన యూనిఫాంను సోఫాపై ఉంచారు. యూనిఫాంను చూసిన దొంగలు ఇది పోలీసు అధికారి ఇల్లని గ్రహించి ఉంటారు. అయినా ఏ మాత్రం భయపడకుండా ఇంట్లో ఉన్న హుండీని ఎత్తుకొని వెళ్లారు.


చోరీ జరిగిన ఎస్‌ఐ ధనుంజయ ఇల్లు